సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



ఫిర్యాదులను సత్వరమే..
ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులకు సూచించారు.
- 10లో ▸



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల..
వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /18.7

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం పూట చల్లనిగాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శిక్షణ కేంద్రంలో సౌకర్యాలను మెరుగుపర్చాలి



బోధన్‌ : పోలీసు ట్రెయినింగ్ సెంటర్‌లో సౌకర్యాలు, వసతిని మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారులను సీపీ సాయిచైతన్య ఆదేశించారు. ఎడపల్లి మండలం జానకంపేట గ్రామశివారులోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సీపీ సోమవారం సందర్శించారు. కేంద్రం పరిసరాల్లో కలియదిరిగారు. గదులు, వంటశాల, నీటిసరఫరా, మరుగుదొడ్లు, అవుట్ డోర్ పరేడ్ గ్రౌండ్, ఫైరింగ్ రేంజ్ పరిశీలించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, శిక్షణా కేంద్రం ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

వైన్ షాపులకు 232 దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్‌: జిల్లాలోని 102 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు మొత్తం 232 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 83 దరఖాస్తులు అందాయని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి : డైట్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపక పోస్టుల (గెస్ట్ లెక్చరర్)భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయానికి అభ్యర్థుల వయస్సు 65 సంవత్సరాల లోపు ఉండాలని, రిటైర్డ్ లెక్చరర్లు, టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ సబ్జెక్టుల్లో ఒక పోస్టు, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో ఒక పోస్టు, ఉర్దూ మీడియంలో రెండు పోస్టులు మ్యాథమేటిక్స్, ఫిలాసఫీ/సోషియాలజీ/సైకాలజీ సబ్జెక్ట్స్‌లో ఖాళీలు ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు ఎంఎడ్ అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఎంఎడ్ అభ్యర్థులు అందుబాటులో లేనిపక్షంలో సంబంధిత సబ్జెక్టుకు బీఎడ్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు కళాశాలలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

రేపు జాబ్ మేళా

నిజామాబాద్ నాగారం: నిరుద్యోగులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బీపీ మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళా ద్వారా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, టెక్నీషియన్, సెక్యూరిటీ గార్డు, సలహాదారు, క్యాషియర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిజామాబాద్‌నగరంలోని శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 99594 56793, 99487 48428, 63057 43423 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోలీస్ సిబ్బందికి ఉలెన్ జాకెట్లు పంపిణీ



నిజామాబాద్‌అర్బన్‌: ఏఆర్, సివిల్ పోలీస్ సిబ్బందికి సీపీ సాయిచైతన్య సోమవారం తన కార్యాలయంలో ఉలెన్ జాకెట్లు, హవర్ సాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా అందజేశామని, సిబ్బంది ఉలెన్ జాకెట్లు, హవర్ సాక్సులు తమ వెంట ఉంచుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి, ఆర్ఎస్సైలు నిశిత్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతపై నిఘా ఏదీ?

- ప్రమాణాల విధానాలు సరే.. అమలు అంతంతేనా..?
- గృహోపకరణాలు, ఆటోమొబైల్స్, సిమెంట్, స్టీల్ తదితరాల ప్రమాణాలపై లేని పట్టింపు
- అందరికీ ప్రియమైన బంగారంలో అనేక లోపాలు
- హెచ్‌యూఐడీలో మాయాజాలం
- నేడు అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం

మనం వాడే, మనకు అవసరమైన వస్తువుకు ప్రాముఖ్యత దాని నాణ్యతాప్రమాణంపై ఆధారపడి ఉంటుంది. మరి వస్తువు నాణ్యతాప్రమాణాల కోసం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విధానాలు సూచించినప్పటికీ అమలు మాత్రం అంతంతగానే ఉండటం గమనార్హం. అతి విలువైన బంగారం కొనుగోళ్ల సందర్భంగా వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆహార పదార్థాలతోపాటు బంగారం, వెండి ఆభరణాలు, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, కార్లు, బైక్స్ తదితర ఆటోమొబైల్స్, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిమెంట్, స్టీల్ తదితర ఇతర అన్నిరకాల వస్తువులకు సంబంధించి 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్'(బీఐఎస్) నిర్దేశించిన మేరకు నాణ్యతాప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అందరికీ ప్రియమైన, ప్రస్తుతం రోజురోజుకూ భారీగా ధర పెరుగుతున్న బంగారం విషయానికి వస్తే హెచ్‌యూఐడీ (హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్) నంబరు విషయంలో మాయాజాలం జరుగుతోంది. అయితే రాష్ట్రంలో, దేశంలోనూ ఈ ప్రమాణాలు పాటించడం సంగతి అటుంచితే.. ఇందుకు సంబంధించి నిఘా పెట్టే వ్యవస్థ సక్రమంగా పనిచేయలేని పరిస్థితి. ప్రతి రాష్ట్రంలో ఒక్కచోట మాత్రమే ఉండే బీఐఎస్ కార్యాలయాలకు తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో ఇన్స్‌పెక్షన్లు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో తగిన చర్యలు తీసుకునే అవకాశాలు లేవు. దీంతో నాణ్యతా ప్రమాణాల విధానాలు ఆశించినవిధంగా అమలు కావడం లేదు. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం నేపథ్యంలో కథనం..

అన్నిరకాల వస్తువులకు సంబంధించి నాణ్యత పరంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రమాణాలు (స్టాండర్డ్స్)ను నిర్ణయిస్తుంది. ఈ మేరకు ఆయా వస్తువుల అమ్మకాలు చేపట్టాలి. అప్పుడే వినియోగదారులకు ఆర్థికపరంగా, ఆరోగ్యరీత్యా రక్షణ ఉంటుంది. అన్నింటిలో ఖరీదైన, పెట్టుబడి వస్తువుగా ఉన్న బంగారు ఆభరణాలకు ప్రమాణాలతోపాటు ఆరు అంకెల హాల్ మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యుఐడీ)ని తప్పనిసరిగా ముద్రించాలి. ఈ నంబర్ రసీదుపైనా ఉండాలి. అయితే ఈ ప్రమాణాల విధానం సరైనదే అయినప్పటికీ అమలులో లోపాల కారణంగా వినియోగదారులు నిరంతరం మోసపోతూనే ఉన్నారు. ప్రమాణాల అమలుపై బీఐఎస్ విభాగానికి సంబంధించి రాష్ట్రంలో ఒక్క కార్యాలయం మాత్రమే ఉండడంతోపాటు తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో తనిఖీలు చేసే పరిస్థితి లేదు. దీంతో ప్రమాణాలు సరిగానే అమలు చేస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించే పరిస్థితి లేదు. మరోవైపు వినియోగదారులకు ప్రమాణాల విషయమై అవగాహన లేకపోవడంతో ముఖ్యంగా బంగారు ఆభరణాలపై లోపాలతో కూడిన నకిలీ ముద్రలు, ఇతర వస్తువులపై అసలు ముద్రలే (బీఐఎస్, ఐఎస్ఐ) లేకపోవడంతో దారుణంగా మోసపోతున్నారు. తెలంగాణలో బంగారు ఆభరణాలపై హెచ్‌యూఐడీ ప్రమాణాల ముద్రలు వేసే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అనుమతించిన 22 హాల్‌మార్కింగ్ కేంద్రాల్లో 16 కేంద్రాల లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేశారు. ఇక దేశవ్యాప్తంగా 546 హాల్‌మార్కింగ్ కేంద్రాల లైసెన్సులు రద్దు చేయడం గమనార్హం. ఈ లైసెన్సులు కలిగి ఉన్న కేంద్రాలు ముద్రలు వేసే విషయంలో అనేక అవకతవకలకు పాల్పడడంతో వాటిని రద్దు చేశారు. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఒక్కోటి మాత్రమే ఉన్న బంగారం హాల్‌మార్క్ కేంద్రాల లైసెన్సులు రద్దు చేయడంతో వినియోగదారులకు ముద్రలు లేకుండానే అమ్మకాలు చేస్తున్నారు. కచ్చితమైన ప్రమాణాల నిబంధనలు ఉన్నప్పటికీ వినియోగదారులు మోసపోతున్న పరిస్థితి.

హెచ్‌యూఐడీ నంబరు అనే మాటే లేదు



బంగారు, వెండి ఆభరణాల వ్యాపారంలో లీగల్ మెట్రాలజీ శాఖ కేవలం ఎలక్ట్రానిక్ కాంటాలు, తూకంల తనిఖీకే పరిమితమవుతోంది. వినియోగదారులు బంగారు, వెండి ఆభరణాల నాణ్యత విషయంలో మోసపోతున్నారు. అధికారులు నాణ్యత పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో వ్యాపారులు బిల్లులపై హెచ్‌యూఐడీ నంబరు వేయకుండానే విక్రయాలు చేస్తున్నారు. వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 28వ తేదీ వరకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలపై కార్యక్రమాలు చేస్తున్నాం. వినియోగదారులను చైతన్యవంతులను చేస్తూ, నాణ్యతా లోపాలతో మోసపోయిన వినియోగదారులు.. వినియోగదారులు కమిషన్‌లలో ఫిర్యాదు చేసేవిధంగా కార్యక్రమాలను రూపొందించాం. దేశంలో ఇటీవల కాలంలో ఏకంగా 546 హాల్‌మార్క్ కేంద్రాల లైసెన్సులు రద్దు కావడాన్ని వినియోగదారుల హక్కుల పరిరక్షణ దృష్ట్యా అతిపెద్ద సమస్యగా పరిగణించాలి. ప్రపంచంలో అన్నివర్గాల ప్రజలకు పొదుపు మాంద్యంగా ఉన్న బంగారంపై ప్రమాణాల విధానం కఠినంగా అమలు చేయాల్సి ఆవశ్యకత ఉంది.

– సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి



దొంకేశ్వర్ మండలం తొండాకూర్ శివారులో మక్కలను ఆరబెడుతున్న రైతులు

మక్క కొనుగోళ్లకు ఏర్పాట్లు!

- 26 సెంటర్లను ఖరారు చేసిన అధికారులు
- ఇక ప్రభుత్వ ఆదేశాలే తరువాయి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మక్క కొనుగోళ్లకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్ని సెంటర్లు, ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై కసరత్తు చేసిన అధికారులు.. జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో 26 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయానికి వచ్చారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టనుండగా సహకార సంఘాల ద్వారా మక్కలను సేకరించనున్నారు. ఈ మేరకు ఎంపిక చేసిన సొసైటీల్లో ఈ–పాస్ యంత్రాలను అందుబాటులో పెట్టుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులు సహకార శాఖకు లేఖ రాశారు. అయితే మక్క కొనుగోళ్లపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల ప్రకటన చేయడంతో రెండు, మూడు రోజుల్లో జీవో ద్వారా ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఆదేశాలు రాగానే కేంద్రాలను తెరిచేందుకు సిద్ధంగా ఉండాలని సొసైటీ సీఈవోలకు సూచించారు.

కేంద్రాల్లోనే మద్దతు ధర

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కుగాను 52,093 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. సుమారు 1.45లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పంట కోతలు మొదలై 20 రోజులవుతున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వేచి చూసే పరిస్థితి లేక క్వింటాల్‌కు రూ.2,100 రేటు వచ్చినా రైతులు అమ్మేస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2,420 మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధరను పొందలేకపోతున్నారు. మొక్కజొన్న కోతలు దాదాపు పూర్తి కాగా, మార్కెట్‌లో 40 శాతం మక్కలు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం ఇంకా ఆలస్యం చేస్తే వ్యాపారులు మరింత తక్కువ ధరకు కొనే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

“ ఆదేశాలు రాగానే తెరుస్తాం


మక్కలను కొనుగోలు చేసేందుకు జిల్లాలో సెంటర్లను ఎంపిక చేశాం. సొసైటీల ద్వారా రైతుల నుంచి మక్కలను కొంటాం. ప్రభుత్వం నుంచి రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశాలున్నాయి. రాగానే కేంద్రాలను తెరుస్తాం.

– దాసోజు మహేశ్, మార్క్‌ఫెడ్ డీఎం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేది ఇక్కడే..

మండలం	సెంటర్లు	మండలం	సెంటర్లు
ఆలూర్	ఆలూర్	మెండోరా	సావెల్
ఆర్మూర్	ఆర్మూర్, పిప్రి, ఫత్తేపూర్	ముప్కాల్	రెంజర్ల, వేంపల్లి
జక్రాన్‌పల్లి	అర్గుల్, కొలిప్యాక, మునిపల్లి	ఏర్గట్ల	తాళ్లరాంపూర్, ఏర్గట్ల
డొంకేశ్వర్	డొంకేశ్వర్	కమ్మర్‌పల్లి	కోనసముందర్, చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి
నందిపేట్	కుద్వాన్‌పూర్, అయిలాపూర్	మోర్తాడ్	శెట్పల్లి, మోర్తాడ్
ధర్పల్లి	రామడుగు	వేల్పూర్	పడగల్, వేల్పూర్, పచ్చల నడ్కుడ
బాల్కొండ	బాల్కొండ	వర్ని	జాకోరా

ఎస్సారెస్పీలోకి మళ్లీ పోటెత్తిన వరద



వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

- నాలుగు గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కుల నీటి విడుదల
- నిండుకుండలా శ్రీరాంసాగర్

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద ఆదివారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పోటెత్తింది. ప్రాజెక్ట్‌లోకి గరిష్టంగా 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 16 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 50 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రానికి క్రమంగా ఇన్‌ఫ్లో 34 వేల 709 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో దిగువకు నీటి విడుదలను తగ్గించారు. 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాత్రి సమయానికి ఇన్‌ఫ్లో మరింత తగ్గి 23 వేల క్యూసెక్కులకు పడిపోవడంతో నాలుగు గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు

- ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు ఎదురైతే అధికారులదే బాధ్యత
- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి




వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్‌: ధాన్యం సేకరణలో అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు పెడతామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా, ధాన్యం సేకరణ ప్రక్రియ సాఫీగా సాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ సందర్భంగా ఎక్కడైనా రైతులు ఆందోళనలకు దిగితే సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్లు క్రియాశీలక పాత్ర పోషిస్తూ, బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపర్చాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పచ్చి ధాన్యం కోయకుండా రైతులు, హార్వెస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్‌రావు, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసేవారికే పదవులు

- అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం
- నియోజకవర్గాల వారీగా పర్యటిస్తా
- ముందుగా డీసీసీ, సీసీసీ పోస్టుల భర్తీ
- ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్



విలేకరులతో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్

నిజామాబాద్ సిటీ: డీసీసీ, సీసీసీ అధ్యక్ష పదవులను త్వరలో భర్తీచేస్తామని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ కోసం పని చేసే వారికే పదవులు కట్టబెడతామని ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఖాళీగా ఉన్న పదవులన్నింటిని ఏఐసీసీ ఆదేశాల మేరకు త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. అన్ని జిల్లాల్లో డీసీసీ, సీసీసీ పోస్టులను ముందుగా భర్తీ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నాయకుల అభిప్రాయలను సేకరిస్తామని, ఇప్పటికే బ్లాక్ లెవల్ కాంగ్రెస్ నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. వారం రోజులపాటు జిల్లాలో ఉండి అన్ని నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు రిజ్వాన్ తెలిపారు. ఈనెల 14న బోధన్‌లో, 15న ఆర్మూర్‌లో, 16న బాల్కొండ, 17న నిజామాబాద్ రూరల్‌లో, బాన్సువాడ నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కె నగేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ యాదగిరి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50వేల పరిహారమివ్వాలి

- వరద కారణంగా పంటలను నష్టపోయాం
- యంచలో గోదావరి తీరప్రాంత రైతుల రాస్తారోకో

నవీపేట : గోదావరి వరద కారణంగా పంటలను కోల్పోయిన మండలంలోని నది పరీవాహక ప్రాంత రైతులు సోమవారం యంచ – బాసర రహదారిపై రాస్తారోకో చేశారు. కోస్లి, మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ, బినోల, తుంగిని, నిజాంపూర్, నాళేశ్వర్ గ్రామాల పరిధిలో చేతికొచ్చిన పంటలు నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టం వాటిల్లి మూడునెలలవుతున్నా ఇంతవరకు అధికారులు ఎలాంటి హామీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సొంత గ్రామంలోనే ఈ దుస్థితి ఉందని, ఇంత వరకు ఎమ్మెల్యే ఎలాంటి ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అరగంటపాటు రాస్తారోకో కొనసాగడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు జోక్య చేసుకుని నచ్చజెప్పడంతో రోడ్డు పక్కన గంటపాటు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్, వామపక్ష పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. బినోల, నాగేపూర్ సొసైటీల మాజీ అధ్యక్షులు మగ్గారి హన్మాండ్లు, శైలేశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావ్, తెడ్డు పోశెట్టి, ప్రవీణ్‌కుమార్, రవీందర్‌రావ్, సంజీవ్, లాలుయాదవ్, బీజేపీ నాయకులు ద్యాగ సరిన్, పిల్లి శ్రీకాంత్, ప్రవీన్, వామపక్ష నాయకులు, తొమ్మిది గ్రామాల రైతులు పాల్గొన్నారు.



యంచలో రాస్తారోకో చేస్తున్న రైతులు

క్లుప్తంగా

బీసీ జేఏసీ జిల్లా కమిటీ నియామకం


పోతన్‌కర్ లక్ష్మీనారాయణ


బొబ్బిలినర్సయ్య

నిజామాబాద్ నాగారం: నగరంలోని గీతాభవన్‌లో సోమవారం బీసీ కమిటీల అన్ని సంఘాలు, జేఏసీ రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా కమిటీని నియమించినట్లు నాయకులు రేవంత్ తెలిపారు. జిల్లా చైర్మన్‌గా పోతనకార్ లక్ష్మీ నారాయణ, కో–చైర్మన్‌గా బొబ్బిలి నర్సయ్య నియమితులయ్యారు. ప్రతి కుల సంఘం నుంచి ఒక ప్రతినిధిని కో–కన్వీనర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. బీసీ నాయకులు నాగరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ పోషణ మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అడిషనల్ కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 16 వరకు జరిగే పోషన్ మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ డీఎం దాసోజు మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మక్క కోతలు మొదలై 20 రోజులైనా ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని కోరారు. నాయకులు సాయిరెడ్డి, ఆకుల పాపన్న, సాయిలు, దేవన్న, గంగాధర్, మోహన్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో జరిగిన పరీక్షకు మొత్తం 29 మంది అభ్యర్థులకు గాను అందరూ హాజరయ్యారైనట్లు ఆయన తెలిపారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఇతర అధికారులు

- అదనపు కలెక్టర్ అంకిత్
- ప్రజావాణిలో 88 వినతుల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌తో పాటు డీఆర్డీవో సాయాగౌడ్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. మొత్తంగా 88 ఫిర్యాదులు అందాయి. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి



ధర్పల్లి మండలం దుబ్బాక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సోప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇటీవల 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సెల్‌ఫోన్ తీసుకువచ్చాడని టీసీ ఇచ్చి పంపించడం అనైతికమన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వాడిని సక్రమమార్గంలో నడిపించే టీచర్లే సరైన కారణం లేకుండా టీసీలు ఇవ్వడం సరైనది కాదన్నారు. జిల్లా అధ్యక్షుడు యూసుఫ్ బిన్ అబ్దుల్ తదితరులు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి



పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు సంబంధించి 250 కోట్ల రూపాయలను విడుదల చేయాలని బోధన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు నవాతే ప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు సుమారు 250 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే రిలీజ్ చేయాలన్నారు. లేదంటే రాష్ట్రంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు దేవర్ల నాగరాజు, రాజన్న, గౌతమ్ కుమార్, సంజయ్, మోసిన్, బాలరాజ్, ప్రశాంత్, శ్రీకాంత్ మోహన్, కిరణ్, ఎతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయాలి



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి యత్నించిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనుక ప్రమోద్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ప్రమోద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే ప్రజాస్వామ్యం మీద దాడిగా చూడాలన్నారు. గవాయి దళితుడు కాబట్టి ఈ దాడి జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి సీనియర్ నాయకులు మైలారం బాలు. జాతీయ ఉపాధ్యక్షుడుగంగారం, సురేష్ నాంపల్లి, మారుతి, యమున, స్వప్న, భూమయ్య, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 20 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో 20 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సీపీ సాయి చైతన్య అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల అర్జీలను చట్టప్రకారం పరిష్కారం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సమస్య, స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ, సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గర అయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు.

లింబాద్రి గుట్ట జాతరలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్ట(నింబాచలం) లక్ష్మీ నరసింహస్వామి జాతరలో పాల్గొనాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని సోమవారం ఆలయ అర్చకులు పార్థసారథి ఆహ్వానించారు. ఈమేరకు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి, ఆహ్వాన పత్రికను అందజేసి, ఆశీర్వదించారు. వచ్చే నెల 5న జరిగే జాతరకు హాజరుకావాలని కోరారు.

ముగిసిన ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి టోర్నమెంట్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానం కొనసాగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈసందర్భంగా జిల్లాస్థాయి అండర్ 17 వాలీబాల్, అండర్ 14 కబడ్డీ బాలబాలికల పోటీలలో 16 జోన్ల బాలబాలికల జట్లు పాల్గొనగా ప్రతిభ చూపిన వారిని తదుపరి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. అండర్ 17 వాలీబాల్ బాలుర విభాగంలో నందిపేట జోన్ ప్రథమ స్థానం, డిచ్‌పల్లి జోన్ ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో ఆర్మూర్ రూరల్ జోన్ ప్రథమ స్థానం, డిచ్‌పల్లి జోన్ ద్వితీయ స్థానం సాధించింది. అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో భీమ్‌గల్ రూరల్ జోన్ ప్రథమ స్థానం, ఆర్మూర్ రూరల్ జోన్ ద్వితీయ స్థానం సాధించింది, బాలికల విభాగంలో నిజామాబాద్ అర్బన్ జోన్ ప్రథమ స్థానం, నందిపేట్ జోన్ ద్వితీయ స్థానం సాధించింది. విజేతలకు బహుమతులు అందజేశారు. డీవైఎస్‌వో పవన్ కుమార్, విద్యాసాగర్‌రెడ్డి, గోపిరెడ్డి, రాజేందర్, అమరవీర్ రెడ్డి, కస్తూరి శ్రీనివాస్, రాజరాజేశ్వర్, ప్రసాద్, అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే



దోమకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు. ప్రతి పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నాయకులు ఐరేని నర్సయ్య, తీగల తిర్మల్‌గౌడ్, అబ్రబోయిన స్వామి, రాజేందర్, మర్రి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- నగరంలో వైద్యాధికారులు, నర్సింగ్ ఆఫీసర్లతో సమీక్ష


పాల్గొన్న వైద్యులు

నిజామాబాద్‌నాగారం: వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లోగల డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఆమె వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులకు, పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. ప్రతి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఏఎన్‌ఎం, ఆశలు, అర్హులైన గర్భిణుల జాబితాను ఉంచుకోవాలన్నారు. రక్తహీనత గల గర్భిణులను ముందే గుర్తించి వారికి పోషకాహారం ఐరన్ మాత్రలు, ఐరన్ సూక్రోజ్ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అత్యంత ప్రమాదకర లక్షణాలు గల గర్భిణులకు మాత్రమే శస్త్ర చికిత్సలు చేయాలని, మిగతా గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువగా ప్రసవాలు చేసిన పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడి, ప్రసవాలు పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రసవానికి ముందే బర్త్ ప్లాన్ ప్రకారం గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లాలని అన్నారు. తద్వారా మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్వేత, అశ్విని, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్, ఏవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

నిజామాబాద్ నాగారం: ప్రతిఒక్కరికి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసెర్సిటేషన్)పై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా నగరంలో సోమవారం ఆమె సీపీఆర్‌పై వివరించారు. ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటూ ఉప్పును తగ్గించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, జీవనశైలి మార్పుల ద్వారానే జీవన శైలి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వారంపాటు జిల్లావ్యాప్తంగా మూడు డివిజన్లలో సీపీఆర్‌పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ కార్యాలయాల తనిఖీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలోని డీఐవో, మలేరియా, పీవోడీటీటీ కార్యాలయాలను, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆఫీస్‌ను సోమవారం డీఎంహెచ్‌వో రాజశ్రీ తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

ముగిసిన అటవీశాఖ స్పోర్ట్స్ మీట్


బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీవాణి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జడ్జి శ్రీవాణి, అటవీశాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన సుమారు 350 మంది అటవీశాఖ క్రీడాకారులు పాల్గొనగా 35 రకాల క్రీడలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో నిర్మల్ జట్టు, మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచాయి. వాలీబాల్‌లో ప్రథమ విజేతగా ఆదిలాబాద్, రన్నరప్‌గా నిర్మల్ జట్టు, క్రికెట్‌లో నిజామాబాద్ జట్టు, కబడ్డీ పురుషుల విభాగంలో నిజామాబాద్, మహిళల విభాగంలో నిర్మల్ జట్టు, త్రోబాల్ మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు, మార్చ్‌పాస్ట్‌లో నిర్మల్ జట్టు విజేతగా నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్స్ ట్రోఫీని నిర్మల్ జట్టు కైవసం చేసుకుంది. నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్ మీనా, నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను, అధికారులు సుధాకర్‌రావు, శివకుమార్, నాలుగు జిల్లాల అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకర ప్రయాణం

బాల్కొండ: మహారాష్ట్ర ప్రాంతం నుంచి అనేక మంది కూలీలు ఇటీవల మక్క నూర్పిళ్ల కోసం మండలానికి వచ్చారు. ఈక్రమంలో వారు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ప్రత్యేక వాహనాలేమీ లేకపోవడంతో మక్కల నూర్పిడి యంత్రంపైనే కూర్చుండి, ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో పట్టు తప్పిందో అంతే సంగతులంటూ పలువురు పేర్కొంటున్నారు. ఇలా సోమవారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో వారు ప్రయాణిస్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. వివరాలు ఇలా.. అచ్చంపేట గ్రామానికి చెందిన మ్యాదరి శివగంగ, సత్యనారాయణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె మధురశ్రీ(3) ఆదివారం రాత్రి వేళ ఇంటి ఆవరణలో బహిర్భూమికి వెళ్లింది. కొద్దిసేపటికి ఇంట్లోకి పరుగెత్తుకు వస్తుండగా అదే సమయంలో ఇంటిపక్కనే ఉన్న శ్రీనివాస్ తన వాహనాన్ని తీస్తుండగా ప్రమాదవశాత్తు మధురశ్రీ కాళ్ల పైనుంచి వెళ్లగా తీవ్రంగా గాయపడింది. వెంటనే గమనించి కుటుంబీకులు ఆమెను ఎల్లారెడ్డిలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స తర్వాత ఇంటికి తీసుకురాగా రాత్రివేళ మళ్లీ ఆమె అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించగా మృతిచెందింది. ఈమేరకు స్థానిక ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇజ్రాయిల్‌లో వెంకటాపూర్‌వాసి..

వేల్పూర్: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నీరటి బొర్రన్న(52) ఇజ్రాయిల్ దేశంలో గుండెపోటుతో మృతిచెందినట్లు సోమవారం తెలిసింది. బొర్రన్న సుమారు 16 ఏళ్లుగా ఉపాధి కోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లివస్తున్నాడు. అక్కడ ఈనెల 11న ఉదయం స్నానం కోసం బాత్‌రూంకు వెళ్లగా, గుండెపోటుకు గురై మరణించినట్లు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ఇజ్రాయెల్‌లో ఉన్న వెంకటాపూర్ గ్రామస్తులు, బంధువులు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె ..

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని క్రిష్టారెడ్డి ఆదివారం రాత్రి తన పొలం వద్ద గేదెను కట్టి ఉంచి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా పంట పొలానికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చనిపోయి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడం వల్ల గేదె కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిటనట్లు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మృతురాలు నిర్మల్ జిల్లావాసి..

బాల్కొండ: మెండోరా శివారులో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. సోమవారం మృతదేహం వివరాలు తెలిసినట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. మృతురాలిని నిర్మల్‌జిల్లా కుబీర్ మండలం శాంగ్వి గ్రామానికి చెందిన బొమ్మడి హంస(54)గా గుర్తించారు. వ్యవసాయ కూలీగా పనిచేసుకునే హంసకు కుటుంబంలో తరుచు గొడవలు జరిగేవి. దీంతో జీవితంపై విరక్తితో ఈ నెల 11న ఇంట్లో ఎవరికి చెప్పకుండ మెండోరా మండలం పోచంపాడ్ గ్రామ శివారులో కాకతీయ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించమన్నారు.

బోధన్‌లో ముగ్గురికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ముగ్గురికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గోశాల వద్ద మట్కా నిర్వహిస్తున్న సెనావత్ మారుతిని పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరుపర్చారు. అలాగే పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన సల్మాన్, కౌనాపూర్‌కు చెందిన మహ్మత్ ఫేరోజ్ మద్యం సేవించి వాహనం నడిపడంతో పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పర్చారు. సల్మాన్‌కు రెండు రోజుల జైలు శిక్ష, ఫిరోజ్‌కు ఒక రోజు జైలు శిక్షను జడ్జి విధించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో..

బోధన్: ఎడపల్లి మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో నిజామాబాద్ నగర కేంద్రానికి చెందిన షేక్ సలీం, సయ్యద్ మెహతార్, అలీన సుభాష్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని సోమవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి ఒక రోజు రిమాండ్ విధించారని ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఇదే మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన షేక్ అమీర్ తన మొబైల్ ఫోన్ ద్వారా మట్కా ఆడిస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అర్జున్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మెదక్‌కు చెందిన అర్జున్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతుండగా, మధ్యాహ్నం కళాశాల హాస్టల్ నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు ఎంత గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేవుడి ముందు పెట్టిన దీపం అంటుకొని ఇల్లు దగ్ధం



బాల్కొండ: దేవుడి ఫొటోల ముందు ఉన్న దీపంతో ఇంటికి నిప్పు అంటుకొని కాలిపోయిన ఘటన మెండోరా మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మెండోరాలోని రాజారపు భార్గవి సోమవారం ఇంట్లో దేవుడి ఫొటోల ముందర దీపం ముట్టించింది. అనంతరం ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లింది. కొంత సమయం తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించి, ఇంటి తాళాలు పగలగొట్టారు. కానీ అప్పటికే ఇంట్లో సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ చారి ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం కింద రేషన్ బియ్యాన్ని అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల గాంధారిలో జరిగిన రెండు దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా.. కొన్ని రోజుల క్రితం మండల కేంద్రంలోని చద్మల్ రోడ్డులో ఉన్న శివభక్త మార్కండేయ ఆలయ హుండీని గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి దోచుకున్నారు. అదేరోజు పెద్దమ్మ కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ఓ బైక్ చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ రెండు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఉప్పు సంతోష్‌కుమార్‌గా గుర్తించారు. సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. నిందితుడిని గుర్తించి, పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ సంజయ్, హోంగార్డ్ బంతిలాల్‌లను అభినందించారు.

బైక్ చోరీ కేసులో..

నిజామాబాద్ అర్బన్: బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై సయిద్‌ముజాయిద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ఆర్ఆర్ చౌరస్తాలోని వైన్స్ వద్ద మామిడి ప్రభాకర్ మద్యం తాగడానికి వెళ్లాడు. తన బైక్‌కు తాళాలు అలాగే ఉంచి వెళ్లడంతో తిరిగి వచ్చేసరికి చోరీకి గురైంది. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. న్యాల్‌కల్ రోడ్డుకు చెందిన ఎర్రం భూమయ్య, కంఠేశ్వర్ నవీన్ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించి, వారి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశామన్నారు.

ఎల్లారెడ్డి వైన్స్‌లో చోరీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని త్రిశూల్ వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. వైన్స్ దుకాణంపైన ఉన్న రేకులను గుర్తుతెలియన దుండగులు తొలగించి, లోపలికి చొరబడ్డారన్నారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లోని రూ.15వేల నగదును దొంగిలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.